# అమీ!

రచన :
చెరుకుమూడి ఇందిరాదేవి

★

మా అయిదేండ్లచిట్టి జ్యోత్స్నకు ఎనభైఏళ్ల పండుముసలి ఆరోగ్యస్వామి ప్రియమిత్రుడు. అవ్యక్తమైన భావాలతో నిండిన ఆ సున్నితమైన వయసులోనున్న మాచిన్నారి పొన్నారి ఏకైక పుత్రిక, మా పుణ్యాలపంట, అతడంటే ఎంతో ఉత్సాహమూ, అనురాగమూ కనపరుస్తుంది. మంచులాగా మెరిసిపోయే ఆ నిగనిగలాడె గడ్డమూ, కరుణార్ద్ర హృదయమును స్ఫురింపజేసే ఆ నిర్మల నేత్రాలూ కాక బహుశా ఇంకా ఏయే గుణగణాలు మా చిట్టితల్లిని ఆకర్షించాయో చెప్పలేను గానీ ఒక్కటిమటుకు నిజం. అతనంటే జ్యోత్స్నకు పంచప్రాణాలు. అతను లేనిదే ఒక నిముషం కూడా బ్రతకలేదేమో! ముద్దుముద్దుమాటలతో 'అమీ' అని అతన్ని పిలుస్తూంటే అతగాడు పరవశంచెందిపోతాడు. ఎటువంటిపనిలోవున్నా సరే అమాంతంగా పరుగులిడుతూ 'బుల్లెమ్మగారూ' అంటూ ఆప్యాయంగా జ్యోత్స్నను ఎత్తుకొని ముద్దిడుకొని ఆవిడకోరే కోర్కెలు తీరుస్తూంటాడు. కన్న తల్లిదండ్రులకన్నాకూడా ఆరోగ్యస్వామినే ఎక్కువ ప్రేమతో దరిజేరనిస్తుంది మా చిట్టితల్లి. అతనిలో ఏమి ఆకర్షణవుందో ఏమోమరి.

ఉదయం ఆవిడ నిద్రలేచింది లగాయతు రాత్రి పరుండేవరకూ ఆమె సేవలోనే నిమగ్నుడై యుంటాడు అమీ. నిద్రలేవగనే కాలకృత్యాలు తీర్చుకోడంకూడా అతను దగ్గరుంటేనే! మా ఇద్దరిలో ఎవరైనా ఒకవేళ వెళ్లి ఇదిగో నమ్మా పండ్లపొడి, పండ్లు తోముకొని మొఖం కడుక్కుందువుగాని రా అని పిలిచామా, ఉహుం వినదు. పైగా అమీ ఏడని మారాము చేస్తుంది. అతగాడంటే అంత ఆదరణ ఎందుకో మరి. ఆరోగ్యస్వామి మా చిట్టితల్లి చర్యలను చూసి పరమానందభరితుడై మురిసిపోతాడు. ఆవిడసంగతి మీకెందుకుబాబూ, నేనున్నానుగాఅంటూ అతడే జ్యోత్స్నకు కావలసినవన్నీ చేకూర్చిపెడుతాడు. జ్యోత్స్నకు కావలిసిందికూడా అంతేగా! అతనిచెంతలో ఆవిడకు బ్రహ్మానందం. అతనివాక్కు ఆవిడకు వేదవాక్కు. అతని పరిహాసాలు, ఆ వయసులో ఆ చిలిపిచేష్టలూ ఇవీ ఆవిడకు కావలసిన వినోదాలు. ఆ తెల్లనిగడ్డాన్ని నిమరడం ఆవిడకో సరదా.

అమీ ఆవిడను ఒళ్ళో కూచోబెట్టుకొని పిట్టకథలు చెబుతూంటాడుకూడా. ఆవిడ కర్థమయ్యేభాషలో ఆక్షన్సుతోబాటు ఆవిడకు కథలుచెప్పడంలో అతనికి చాకచక్యం కూడా వుంది. మా చిట్టితల్లి ముద్దుగా తలవూపుతూ, అప్పుడప్పుడూ అడ్డసవాళ్ళు వేస్తూ, ఒక్కొక్కప్పుడు పకపకా నవ్వుతూ అతనికి వుత్సాహం కలిగిస్తూంటుంది. అమీ బోసినవ్వులు నవ్వుతూ ఆవిడ సేవలోనే నిమగ్నమైయుంటాడు కూడా! వాళ్ళిద్దరికీ అదేమిటో అవినాభావ సంబంధం? చుట్టుపక్కల ప్రపంచంలో ఆవిడకేమీ ఆకర్షణలేదు. ఆ చిట్టి బుర్రకు ప్రపంచమంటే అతనే అమీ మినహా మిగతా ప్రపంచం శూన్యం. కాటికి కాళ్ళుచాచుకున్న ఆ పండు ముదుసలికి ఆ చిట్టితల్లినిచూస్తే ఎక్కడలేని అనురాగం. కన్నతండ్రికూడా అంతటి అపారమయిన అనురాగాన్ని చూపడేమో!

నాకుకూడా ఈ సంఘటనలు చూస్తుంటే ఒక్కొక్కప్పుడు వినోదమూ, మరోవేళల అసూయా పుట్టుకొస్తాయి. సహజమేకదూ మరి? తన కన్నబిడ్డ తనదగ్గరికి రాకుండా సరిపెట్టుకుంటుంటే ఏతల్లి సహిస్తుంది చెప్పండి? అలాగని నేను చిట్టికూతురి సుఖాని కంతరాయం కలిగించలేదు. ఇంకా వుత్సాహపరుస్తూన్నానుకూడా. ఏం, అమీ ఆఖరికి మా అమ్మాయిని బుట్టలో వేసుకున్నావే అని ఒక్కోవేళల ఎగతాళి చేస్తుంటాను. ఏదోలే తల్లీ, మా బంగారుబుల్లినీ, నన్నూ వేరుచేయకండి అని అతగాడు వాపోతాడు. పిచ్చివాడా ఎందుకలా భయపడతావని నేను అతన్ని సముదాయిస్తుంటాను. అమీ కండ్లనీళ్ళుపెట్టుకొని నా కాళ్లముందర పరుండి వేడుకుంటాడు అతని వెర్రిచేష్టలు చూస్తుంటే నాకుకూడా కండ్లల్లో నీళ్ళు మెదులుతాయి. అమీ ఇకలే, జ్యోత్స్న నీదేలే అని నేను పదేపదే హెచ్చరించాక అతగాడు లేచి మందహాసవదనంతో నాకు నమస్కరించి మా చిట్టితల్లినెత్తుకొని వెళ్ళిపోతాడు తోటలోకి. అంతే! అలానే దిగ్భ్రమపడి చూస్తూ నిలబడుతుంటాను.

"చూచారా!" అంటాను మావారితో.

"అంతేలే. అంతగాక ఇంకేమౌతుంది. ఫరవాలేదులే" అంటారు వారు. ఇద్దరం పకపకా నవ్వుకుంటాము.

అమీ మాయింటిలో నౌకరికిచేరి దాదాపు ఒక సంవత్సరం అవుతూంది. అతను మాదగ్గర నౌకరికి చేరటము బహువిచిత్రంగా జరిగింది, నాకు బాగా జ్ఞాపకం. ఆరోజు మిట్టమధ్యాహ్నం. బాగా ఎండకాస్తూంది. ఆరోజు ఆఫీసు సెలవు. అంచేత మావారు ఇంట్లోనే వుండిపోయారు. వాకిటి తలుపు గడియవేసుకొని లోపల ఈజీచేరువేసుకొని పరుండి

పున్నారు. మధ్యాహ్నం ఎండగాడ్పులకు నిద్ర పట్టిపట్టని స్థితిలో అలానే పరుండివున్నారు.

ఇంతలో వులిక్కిపడిలేచారు. వాకిట్లో ఎవడో మూలుగుతూన్నట్టు వినొచ్చింది. సంగతేమిటో అర్థంకాక కాసేపు ఆలోచిస్తూ నిలబడ్డాము. మూలుగు స్పష్టంగా వినిపిస్తుంది. తలుపుతీసి బైటచూద్దుముగదా ఒక పండుముసలివాడు ముద్దలాగా ముడుక్కొని పడి మూలుగుతున్నాడు. మమ్ము చూడ్డంతోటే 'బాబూ' అని కూపస్థమండూకంలాగా విని పించీ వినిపించని స్థాయిలో మావైపుచూసి అన్నాడు చేత్తో తన పొట్టవైపు చూపిస్తూ. ఆ కళ్లల్లో స్ఫురించే దీనస్థితీ, అతని వైఖరీ, అతనిదుస్తులూ చూచాక మాకు కళ్ళల్లో నీళ్ళు మెదిలాయి. ఆకలితో అలమటించే ఈ నిర్భాగ్యుణ్ణి చూస్తే ఎవరికి జాలిరాదు చెప్పండి అతగాడికి అన్నం పెట్టించాను పాపం, చాలారోజులనుంచీ అన్నం సరిగ్గా తినలేదుగాబోలు. పెట్టిన కొద్దిఅన్నమూ బహు ఆత్రంతో తినేశాడు. చెంబులో నీళ్ళుపోసియిస్తే బైటికిపోయి చేతులు కడుక్కొన్నాడు. ఇంటిలోపలికొచ్చి చెంబు వుంచాడు.

అలానే మాఇద్దరివైపు చూస్తూ నిలబడ్డాడు. మాచిట్టితల్లి జ్యోత్స్న చీరకొంగు పట్టుకొని విచిత్రంగా చూస్తూ నిలబడింది.

రెండుచేతులు జోడించి మా యిద్దరికీ నమస్కరించాడు. మా చిట్టితల్లి జ్యోత్స్నవైపు జాలిగా చూస్తున్నాడు.

"బాబులూ" అన్నాడు జాలిగా.

సంగతేమిటని పరామర్శించారు మావారు. జవాబు చెప్పడు. కండ్లవెంబడి నీళ్ళుకారుతున్నాయి.

"బాబులూ" మళ్ళీ మెల్లగా అన్నాడు.

"ఏంది తాతా ఏదోచెప్పబోయి సంకోచిస్తున్నావ్?"

రెండుచేతులూ జోడించి మళ్ళీ నమస్కారంచేసి మెల్లగా అన్నాడు "బాబులూ నేనిక్కడే వుండిపోతాను. అమ్మాయినిచూస్తే ఈ ఇల్లు వదలడానికి నాకు బుద్ధి పుట్టటంలేదు. ఆ తల్లిని కనిపెట్టుకొని పరుండివుంటాను. ఏదో ముసలాణ్ణి. అన్నిశక్తులూ వుడిగిపోయాయి......" ఇదే ధోరణిలో సాగిపోయింది. నేను మావారివైపు చూచాను. అర్థంచేసుకున్నారు.

"సరేలే తాతా. ఇక్కడే వుండిపోదువుగాని..."

ముసలాడి ముఖం సంతోషంతో తళుక్కుమంది. తెల్లటి గడ్డం మిలమిలా మెరిసిపోయింది.

"తాతా" అని ముద్దుగాపిలుస్తూ మా చిట్టి జ్యోత్స్న అతని చేతుల్లోకి దూకింది. ఆప్యాయంగా అవిడను ఎత్తుకున్నాడు తాత.

ఎందుకైనా మంచిదని అతని మూవ్‌మెంట్స్‌ను ఒక కంట కనిపెట్టిచూచాం కొన్నాళ్ళు. మేం అనుకున్నదేమీ జరగలేదు. ఆరోగ్యస్వామి మాయింటికి రావటం దైవ సంకల్పమే. ఇప్పుడు మా అమ్మాయిని గురించిన దిగులు ఏమీ నాకులేదు. ఆరోగ్యస్వామి వున్నన్నాళ్ళూ నాకేమీ భయంలేదని మనసులో మా ఇద్దరికీ నాటుకపోయింది.

ఇది సంవత్సరంనాటి సంగతి.

* * * *

సుమారు వారంరోజులనాటి సంగతి. ఆమీకి ఆదినం దుర్దినమే అనాలి. జ్యోత్స్నకు గాలిపటం తీసుకరావడానికి ఆమీ బజారుకెళ్ళాడు.

పరధ్యానంగా బజారులో వెడుతూన్నాడు కాబోలు ఒక మోటారుక్రింద పడిపోయాడు

మావారికి ఆఫీసుకు వెంటనే వర్తమానంచేరింది.

ఆసుపత్రిలో ఆరోగ్యస్వామి మరణావస్థలో వున్నాడు.

మావారిని చూడ్డంతోటే భోరున ఏడ్చాడుట.

"చి...ట్టి...త...ల్లి...గాలిపటం..." రెండుమాటలతో ప్రాణాలు లేచిపోయాయి.

మావారు ఆ పరిస్థితిలో కండ్ల నీరుపెట్టుకున్నారట. సాయంత్రం ఇంటికొచ్చారు. సంగతి నాకు తెలిపారు. నేను కూడా దుఃఖాన్ని దిగమింగుకోలేకపోయాను. అమ్మాయి దిగులుపడుతుందని బలవంతంమీద కంట్రోల్ చేసుకున్నా.

"నాన్నారూ! ఆమీ ఏడీ గాలిపటంతెత్తానని పోయాట్ట" ముద్దుగా జ్యోత్స్న అడుగుతూంటే మావారు ఆవేశంతో అమ్మాయి నెత్తుకున్నారు.

"నాన్నాలూ గాలిపటం" అని మళ్లీ అడిగింది.

"అతను తెస్తూన్న గాలిపటం ఆకాశంలోకి ఎగిరిపోయిందట. ఆకాశానికెళ్ళి గాలిపటం తీసుకొస్తాడుగా చిట్టి తల్లీ, ఇంక కాసేపట్లోనే వస్తాడు..." అన్నారు మావారు. జ్యోత్స్న తలవూపింది.

"ఇప్పుడే వత్తాలా" అని మళ్ళీ అడిగింది.

"ఇప్పుడేనమ్మా..." నేనుకూడా అష్యూర్‌చేశాను.

ఈ వారంరోజులనించీ ఎప్పుడూ మా చిట్టితల్లి ఆకాశంవైపు చూస్తూ నిలబడివుంది పాపం!